# జీవితంతో చెలగాటం

రచన.
శ్రీ ఆడపా రామకృష్ణశ్రీ.

ఆ రోజు సోమవారం, ఎదురుగానున్న ఈశ్వరాలయంలో పూజారులు మంత్రాలు పదకొండు గంటలైనా జోరుగా సాగుతున్నాయి.

విప్రులు, విప్రాంగనలు నుదుటికి నామాలు పూసుకొని వస్తున్నారు, వెళ్తున్నారు.

పిల్లలు ఎండ వేడిమికి తాళలేక చెమట ముఖములతో అటు నిటు పరుగెడుతున్నారు.

గర్భగుడిలోనున్న గంట మాటి మాటికి నా ఊహా రచనలకు భంగం కలుగజేస్తుంది.

భగ్నమైపోతున్న నా రచనలపై అసహ్యం చిరాకు పుట్టింది. పెన్నును మూసి కాగితాలను అలమరాలో భద్రపరిచాను. చిరాకుగా అటు నిటు తిరుగుతున్నాను.

అంతలో, పోష్టుమాన్ కేక వినపడింది. తలుపు తెరిచాను-చేతికి ఒక లెటర్ అందించాడు. అందిన వెంటనే నా కళ్ళు 'ఫ్రమ్' అడ్రసు మీదకు కేంద్రీకరింపబడినవి. గుండెల్లో అమృతధార వర్షించినట్లైంది. ఎవరిదో? స్త్రీ నామం వుంది. హైదరాబాదునుండి వచ్చినట్లుంది వెంటనే ఆతృతతో కవరు విప్పాను. అందు గుండ్రని అక్షరములు అతి సొంపుగా అమర్చబడియున్నవి. ముఖ్యంగా గమనించవలసింది ఇండియన్ యింక్‌తో వ్రాయబడి వుంది. మనస్సులోనే చదవనారంభించాను.

క్రిష్ణగార్కి-!

వందనములు...

నేనెవరో మీకు తెలియకపోయినా మీరు నాకు తెలుసు. మీ పేరు, అడ్రస్సుతో సహా ఒక పుస్తకంలో లభించింది. అప్పటికే మీ రచనలు నేను చదివుంటిని గనుక మీ అడ్రస్సు దొరికిన వెంటనే వ్రాయాలనిపించింది వ్రాసేను. త్వరలో ఈ ఉత్తరానికి రిప్లై వస్తుందని ఆశిస్తున్నాను.

ఇట్లు-
స్నేహప్రియ
సరోజా.....

ఉత్తరం చదివాక నా మనస్సు పరవసించింది. హృదయం ఊగిసలాడింది.

అబ్బ!...ఎంత బాగుందీ వుత్తరం. నిజంగా నా చిన్ననాటి చెల్లెలే వ్రాసిందా?

వ్రాయలేదు. అని హృదయంలోనుండి ప్రతిధ్వనించింది.

అవును. అకస్మాత్తుగా అనంత వాయువుల్లో లీనమైపోయిన నా సోదరి మళ్ళీ ఉత్తరం యెలా వ్రాస్తుంది?

లేదు. నీ చెల్లెలు చనిపోలేదు. నీ మనస్సులో చిరకాలంనుండి నిలిచి జీవించివున్నది నీ హృదిలోనుండే నీ సోదరి ఆక్రోశిస్తుంది, అని మళ్ళీ ప్రతిధ్వనించింది.

ఆ క్షణంలో నే నెక్కడున్నదీ! నేనేం చేస్తున్నానో తెలియలేదు. భూమంతా పచ్చగా కానవస్తూ అగమ్యగోచరమైంది, మధురమైన అనుభూతులతో మనస్సును ఛలింపజేసినవి, గతః స్మృతులతో శరీరమంతా గగుర్పాటు చెందించింది.

నా చిన్నప్పుడు నాకొక ముద్దుల మూటకట్టు సోదరి యుండెడిది. మా యిద్దరి ఆనందాన్ని చూసి మా తల్లి దండ్రులు ముగ్ధులై పోయేవారు. కాని ఆ సంతోషం ఎన్నాళ్ళో

నిలువలేదు. మా యిద్దరి అనుబంధాన్ని చూచిన విధికి కన్ను కుట్టింది.

కాలక్రమమున పిడుగులాంటి మరణవార్త వినిపించింది. గుండెలు బ్రద్దలై శోకాగ్నికి ఆహుతులమైతిమి ప్రళయకాలమందు కొండలు పిండియైనట్లు మా హృదయాలు దహించివేచినవి. నా జీవితంలో నేనొక విలువైన వస్తువును పోగొట్టుకున్నాను, అలాంటి తోబుట్టువతో జీవితమంతా నిష్కల్మషంగా గడుపుదామని నేనెంతో ప్రయాశతో ఎదురుచూస్తున్నాను. అది ఈనాటికి ఫలించిందంటే నా ఆనందం పరిధులు దాటివేస్తుంది.

కళ్ళు తెరిచి చూచాను. గత చరిత్ర కలలా గతించిపోయింది. ఆమె వ్రాసిన ఉత్తరానికి రిప్లై యిచ్చేశాను. సంతోషంతో మరల తీయని మాటలు చదవాలన్న ఆతృతతో!

నాలుగు రోజులు గడిచాయి మళ్ళీ ఓ కవరు వచ్చింది ఆదర బాదరగా, సరోజ దగ్గర నుండో కాదో అని ఫ్రమ్ అడ్రస్సు చూచాను, అది నిజంగా సరోజ దగ్గరనుండి వచ్చిందే. వెంటనే కవరు విప్పాను,

'డియర్ క్రిష్ణా,'

నీ వుత్తరం అందింది. నా హృది చెదిరింది. నీ మనస్సు చెలించింది. నీ రిప్లైవలన నే ననుకున్న మహాత్కార్యము జరగదని నిరూపిస్తుంది.

'పూర్వం శ్రీకృష్ణుడు పదహారువేల మంది కన్యల మనస్సులను చక్కగా అర్థం చేసుకొని వారి అభిమతం నెరవేర్చాడు', కాని ఈ కలియుగ శ్రీకృష్ణుడు మాత్రము ఈ ఒక్క స్త్రీ హృదయాన్ని అర్థంచేసుకోలేకపోతున్నాడని విచారిస్తున్నాను. ఏమైనా మనం ఉత్తరాలు వ్రాసుకోవడం వుత్త దండుగనిపిస్తుంది అందువలన నేటినుండి మీకు ఉత్తరములు వ్రాయుట విరమిస్తున్నాను, పాత భావాలు మీలో బాగా పెనవేసుకొనివున్నాయి. అతి వేగరంగా వాటినుండి మరల్చుకొంటేకాని మీలో అనురాగము అంకురించదు.

మీకు స్వస్తిచెప్పే
సరోజ.

ఉత్తరం చేతినుండి జారిపోయింది, భూమ్యాకాశాలు దడదడలాడాయి.

అంతలో ఎవరో నా గదిలో ప్రవేశించినట్లుంది, నాకు చలనమేలేదు. అతడు తియ్యని సాంగ్స్ వినడానికి వచ్చాడుగాబోలు. వచ్చి రేడియో పెట్టాడు. జీవితంతో చెలగాటలాడుతున్నట్లు ఆ గానం రేడియోలోనుండి ఉద్భవించింది.

'మరుపురాని బాధకన్న మధురమే లేదూ!'

– గతము తలచే వగచేకన్నా సౌఖ్యమే లేదూ!!

– అదరాని పొందుకన్నా అందమే లేదూ, ఆనందమే లేదూ!!!

అంటూ గుండెల్లోనున్న అగ్నిజ్వాలలపై చన్నీటి దారగా ప్రవహిస్తూ గానం ముగిసింది.

---

'కథాంజలి'లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు ఏమాత్రమూ మేము బాధ్యులముకాదు. —సంపాదకుడు.